క్లుప్తంగా

లయన్స్‌క్లబ్ ఆఫ్ పెద్దపల్లి అధ్యక్షుడికి గోల్డ్‌మెడల్



గోల్డ్‌మెడల్ అందుకుంటున్న వెంకటేశ్వర్లు

పెద్దపల్లిరూరల్: లయన్స్‌క్లబ్ ఆఫ్ పెద్దపల్లి అధ్యక్షుడు సాదుల వెంకటేశ్వర్లు ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ పాటిల్, డైరెక్టర్ సునీల్‌కుమార్, తీగల మోహన్‌రావు, దీపక్‌భట్టాచారి నుంచి గోల్డ్‌మెడల్ ప్రశంసాపత్రం అందుకున్నారు. క్లబ్ ద్వారా చేసిన సేవలకు, సభ్యుల సంఖ్య పెంచేందుకు కృషి చేసిన వెంకటేశ్వర్లుకు ఈ పురస్కారం లభించింది. కరీంనగర్‌లో రెండు రోజులుగా జరుగుతున్న తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల స్థాయి సమావేశంలో క్లబ్ ప్రతినిధులు మనోజ్‌కుమార్ పురోహిత్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఉత్తర నక్షత్ర పడిపూజ

యైటింక్లయిన్‌కాలనీ: ఉత్తర నక్షత్ర పర్వదినాన్ని పురస్కరించుకొని యైటింక్లయిన్‌కాలనీలోని శ్రీఅయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం రాత్రి మహా పడిపూజను ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన గురుస్వామి శ్రీ అద్దెంకి సారంగచారి గురుస్వామి ఆధ్వర్యంలో ఉదయం ఆలయంలోని శ్రీగణపతి, సుబ్రహ్మణ్యస్వామి, నాగరాజు స్వామి, అమ్మవారి, శ్రీ అయ్యప్పస్వామి మూల విరాట్‌లకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి శ్రీఅయ్యప్ప స్వామి పదునెట్టాంబడి మహా పడిపూజ నిర్వహించి 18 మెట్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు భక్తులకు హారతి, తీర్థప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీకి సిద్ధం

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ వ్యవసాయశాఖ కార్యాలయంలో పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు ఏవో నాగార్జున ఒక ప్రకటనలో తెలిపారు. ఖరీఫ్ రైతాంగం వరిసాగు చేసే క్రమంలో భూమిలో సారం పెంచుకునేందుకు జీలుగ, పిల్లి పెసర విత్తనాలు చల్లితే పంట దిగుబడి అధికంగా వస్తుందని ఏవో పేర్కొన్నారు. కూనారం, కాల్వశ్రీరాంపూర్ సింగిల్‌విండో కార్యాలయాల్లో జీలుగ విత్తనాలు సబ్సిడీ ధరలకు విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. ఒక బస్తా సబ్సిడీ పోను రూ.1116 ఉందన్నారు. అవసరమైన రైతులు పట్టాదారు పాసుపుస్తకాలు ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు అందించి అవసరమైన మేరకు పచ్చిరొట్ట విత్తనాలు కొనుగోలు చేయొచ్చన్నారు. 30కిలోల పచ్చిరొట్ట విత్తనాల బస్తా రెండున్నర ఎకరాలకు సరి పోతుందన్నారు.

ఆర్థిక చేయూత

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం మారేడుగొండ గ్రామంలోని హనుమాన్ భక్త మండలి సభ్యులు గుర్రాంపల్లి, మారేడుగొండ గ్రామాల్లోని మూడు నిరుపేద కుటుంబాలకు రూ.5వేల చొప్పున ఆర్థికసాయం అందించి ఉదారతను చాటుకున్నారు. మారేడుగొండకు చెందిన ఆరగొండ నర్సయ్య, ఆకోజు రుక్కమ్మ, గుర్రాంపల్లిలోని ల్యాగల మధునమ్మ కుటుంబాలకు చేయూతనందించారు. భక్తమండలి సభ్యులు రమేశ్, తిరుపతి, రాజయ్య, శ్రీధర్, రాజు ఉన్నారు.

రాయితీపై జీలుగ విత్తనాలు

ముత్తారం: మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో రాయితీపై జీలుగ విత్తనాలు ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి చిందం శ్రీకాంత్ తెలిపారు. 330 క్వింటాళ్లు అలాట్‌మెంట్ కాగా ప్రస్తుతం 170 బస్తాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. 30 కేజీల బస్తాకు రూ.116 ఉంటుందన్నారు. రైతులు తమ పట్టా పాసు బుక్కు, ఆధార్‌కార్డు తీసుకొని రావాలన్నారు.

వైభవంగా తిరుక్కల్యాణం

ఎలిగేడు: మండలంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీమదలమేల్మంగా సమేత శ్రీవేంకటేశ్వర స్వామి తిరుక్కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయంలో వైభవంగా స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఆలయ అర్చకులు కొండపాక రామాచార్యులు, భాగవతచరణరేణువు రామిడి వెంకటరామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, కొండల్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం


సన్మానిస్తున్న కాలనీవాసులు

సుల్తానాబాద్: పట్టణంలోని స్వప్న కాలనీకి చెందిన దుగ్యాల స్వప్న–వేణుగోపాల్‌రావు దంపతుల కుమార్తె శ్రీజను ఆదివారం ఘనంగా సన్మానించారు. పదో తరగతి ఫలితాలలో శ్రీజ 10 జీపీఏ సాధించింది. కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో సన్మానించారు. మాజీ వార్డు సభ్యులు అమిరిశెట్టి తిరుపతి, కాలనీవాసులు లక్ష్మి, లత, రజనీ, స్వప్న, వసంత, రాధమ్మ, గోక రమేశ్ పాల్గొన్నారు.

కంకర రోడ్డు కష్టాలు తీరేనా?

- శాఖల మధ్య సమన్వయ లోపమే జాప్యానికి కారణమా?
- లక్ష్మీనర్సింహుడిని చేరేందుకు భక్తుల తిప్పలు
- పనులు పూర్తి చేయాలని విజ్ఞప్తి


కంకర తేలిన అందుగులపల్లి - దేవునిపల్లి రోడ్డు

పెద్దపల్లిరూరల్: కంకర తేలిన రోడ్డుపై నెలల తరబడి తిప్పలు పడుతూ ప్రయాణం చేయాల్సిన పరిస్థితి. అయినా అధికారగణం, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపం.. ప్రజలకు శాపంగా మారింది. పెద్దపల్లి మండలం అందుగులపల్లి నుంచి దేవునిపల్లి వరకు గల రోడ్డును తారు రోడ్డుగా మార్చేందుకు చేపట్టిన పనులు ముందుకు సాగడం లేదు. 8నెలల క్రితమే పనులు ప్రారంభమైనా రోడ్డుపై కంకర పోసి వదిలేశారు.

తప్పని తిప్పలు..

పెద్దపల్లి మండలంలోని దేవునిపల్లి, రంగాపూర్ తదితర గ్రామాల ప్రజలు నిత్యం పనుల నిమిత్తం పెద్దపల్లికి రావాలన్నా.. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు ప్రసిద్ధమైన దేవునిపల్లి శ్రీలక్ష్మీనరసింహుడిని దర్శించుకోవాలన్నా కంకర రోడ్డుపై ప్రయాణం చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఏటా లక్ష్మీనరసింహుడి జాతరకు పొరుగు జిల్లాలతో పాటు మహారాష్ట్ర నుంచి వేలాదిగా భక్తులు తరలివస్తుంటారు. రోడ్డు పనులు మొదలు కావడంతో మట్టి రోడ్డుపై ప్రయాణించే బాధలు దూరమయ్యాయని భావిస్తే.. ఇపుడు కంకర రోడ్డు కష్టాలు ఎదురయ్యాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శాఖల మధ్య సమన్వయ లోపమేనా?

రోడ్డు పనులు పొందిన కాంట్రాక్టర్ రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాల తొలగింపునకు టెండర్ అగ్రిమెంట్‌లో రూ.2లక్షలే రాశారని, ఆ నిధులతో తొలగింపు పనులు పూర్తి కావంటున్నారు. మరో రూ.4లక్షలు కేటాయిస్తేనే విద్యుత్ స్తంభాల తొలగింపు సాధ్యమని విద్యుత్ అధికారులు పేర్కొంటున్నారని, ఆర్‌అండ్‌బీ అధికారులు ఆ నిధులు సమకూర్చాలంటున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులెవరూ చొరవ చూపకపోవడంతో పనులు ఎక్కడికక్కడే ఐదారు నెలలుగా నిలిచిపోయాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ చూపి వెంటనే పనులు ప్రారంభమయ్యేలా చూసి ప్రజల ఇబ్బందులను దూరం చేయాలని కోరుతున్నారు.

భక్తులకు ఇబ్బంది


దేవునిపల్లిలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి వెళ్లేందుకు పలు గ్రామాల భక్తులు చాలా ఇబ్బంది పడుతున్నారు. ప్రతిరోజూ ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు పౌర్ణమి నాడు నిర్వహించే కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తుంటారు. ఉన్నతాధికారులు చొరవ చూపి రోడ్డు పనులు పూర్తిచేయించాలి.

– తంగెడ రాజేశ్వర్‌రావు, రాగినేడు

అధికారుల నిర్లక్ష్యం


అందుగులపల్లి నుంచి దేవునిపల్లి వరకు చేపట్టిన తారు రోడ్డు పనులు పూర్తి చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ రోడ్డు పై ప్రయాణం సాగించే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

– రాయిశెట్టి కిషన్, మాజీ సర్పంచ్

వెంటనే పూర్తి చేయాలి


అందుగులపల్లి నుంచి దేవునిపల్లి వరకు చేపట్టిన బీటీ రోడ్డు పనులను వెంటనే పూర్తి చేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలి. అధికారులు జోక్యం చేసుకుని పనుల జాప్యానికి కారణమైన సమస్య పరిష్కరించి రోడ్డుపనులు సాగేలా చర్యలు తీసుకోవాలి.

– తలారి సాగర్, అందుగులపల్లి

లీకేజీ తిప్పలు తప్పేదెన్నడో?


పెద్దపల్లి దేవిడి వద్ద లీకేజీ


అమర్‌నగర్‌లో మరమ్మతు చేస్తున్న సిబ్బంది

- తరచూ పగులుతున్న పైపులు
- వృథాగా పోతున్న తాగునీరు

పెద్దపల్లిరూరల్: పట్టణ ప్రజలకు తాగునీరందించే పైప్‌లైన్ తరచూ పగుళ్లు బారుతోంది. అడుగడుగుకో లీకేజీ కనిపిస్తుండడం స్థానికులను కలవరపాటుకు గురిచేస్తోంది. పైప్‌లైన్ లీకేజీతో తాగునీరంతా రోడ్లపై వృథాగా పోతోంది. ఇంకా కొన్ని చోట్ల డ్రైనేజీల్లోనే పైప్‌లైన్లు ఉండడంతో లీకేజీ కారణంగా నీరు కలుషితమై రోగాల బారిన పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

తాగునీటి సమస్యలు..

పెద్దపల్లి పట్టణం మున్సిపాలిటీగా ఏర్పాటు కావడంతో పట్టణాన్ని ఆనుకుని ఉన్న చందపల్లి, రంగంపల్లి, బందంపల్లితో పాటు పెద్దకల్వలలోని కొంత భాగం పెద్దపల్లిలో విలీనమయ్యాయి. ఇంటింటికీ తాగునీరందించేందుకు చేపట్టిన మిషన్ భగీరథ పథకం పనులు ఇంకా పూర్తిస్థాయిలో కొలిక్కి రాలేదు. ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారా వచ్చే నీటిని సరఫరా చేసేందుకు పట్టణంలో పలు చోట్ల అవసరమైన మేరకు ట్యాంకులు ఉన్నా.. పైప్‌లైన్ నిర్మాణ లోపాల కారణంగానే తాగునీటికి సమస్యలు తలెత్తుతున్నాయి.

అడుగడుగుకో లీకేజీ..

పట్టణంలో ఓ చోట లీకేజీకి మరమ్మతు చేసేలోపే మరో చోట కొత్తగా లీకేజీ అవుతుండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. లీకేజీలను గుర్తించి వాటికి మరమ్మతు పనులు చేయడం తలనొప్పిగానే కాకుండా మున్సిపాలిటీపై ఆర్థికభారం కూడా పడుతోంది. లీకేజీ సమస్య ఉందని తెలిసినా పట్టణంలోని కమాన్ నుంచి జెండావరకు, సాగర్‌రోడ్డు, ధర్మారం రోడ్డులో తారురోడ్డు వేసేటపుడు పైప్‌లైన్లను రోడ్డు పక్కకు మార్చకపోవడంతో లీకేజీ అయినపుడు రోడ్డును తవ్వాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. మున్సిపాలిటీ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పట్టణంలో లీకేజీ సమస్యకు వెంటనే శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని ఆయా కాలనీల స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశాం


పట్టణంలో తాగునీటి పైప్‌లైన్లు తరచూ పగులుతున్నాయి. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకుండా చూసేందుకు ఎప్పటికపుడే లీకేజీలకు మరమ్మతు పనులు చేసేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశాం. అమృత్‌పథకం కింద మంజూరైన నిధులతో తాగునీటి సమస్యల్లేకుండా చూస్తాం.

– వెంకటేశ్, కమిషనర్ పెద్దపల్లి

గ్రూప్ ఇన్సూరెన్స్ పాలసీ అందరికీ వర్తింపజేయండి


వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాదులు

గోదావరిఖనిటౌన్: 2019 తర్వాత వృత్తిలోకి వచ్చిన న్యాయవాదులందరికీ గ్రూప్ ఇన్సూరెన్స్ పాలసీ అమలు చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ బృందం ఆదివారం న్యాయశాఖ కార్యదర్శి ఆర్.తిరుపతిని రాష్ట్ర సచివాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. మే నెలతో గ్రూప్ ఇన్సూరెన్స్ పాలసీ కాలపరిమితి ముగుస్తుందన్నారు. 2024–25గాను న్యూ గ్రూప్ ఇన్సూరెన్స్ పాలసీల్లో మృతి చెందిన న్యాయవాదుల పేర్లు తొలగించి వయసుతో సంబంధం లేకుండా కొత్త వారందరికీ వర్తింపజేసేలా చూడాలన్నారు. ఏఐఎల్‌యూ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు విద్యాసాగర్, అధ్యక్షుడు కొల్లి సత్యనారాయణ, వేణుగోపాల్, శైలజ, శ్రీనివాస్‌రావు, వేంకటేశ్వర్లు, రమేశ్, కిషన్ రావు, శంకరయ్య, మంజులత తదితరులు పాల్గొన్నారు.

సిలిండర్ వాడకంలో అప్రమత్తంగా ఉండాలి


సిలిండర్‌ను పరిశీలిస్తున్న కంపెనీ ప్రతినిధి

ధర్మారం: ఎండాకాలంలో సిలిండర్ వాడడంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఇండేన్ గ్యాస్ ప్రతినిధి టి.ప్రవీణ్‌కుమార్ కోరారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఆదేశాల మేరకు మండలంలోని నందిమేడారం గ్రామంలో ఇంటింటా గ్యాస్ సిలిండర్లను పరిశీలించారు. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఎండాకాలంలో ప్రమాదాలు జరగకుండా మహిళలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా గ్యాస్ లీకేజీలుంటే వెంటనే డీలర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. కిచెన్‌లో మండే వస్తువులను ఎట్టి పరిస్థితిలో ఉండరాదన్నారు.

స్వామివారికి రుద్రాభిషేకం

సుల్తానాబాద్: పట్టణంలోని శివాలయంలో ఏకాదశి సందర్భంగా స్వామివారికి ఆలయ కమిటీ చైర్మన్ అల్లంకి సత్యనారాయణ దంపతులు రుద్రాభిషేకం నిర్వహించారు. ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హాజరైన దంపతులకు, భక్తులకు తీర్థ ప్రసాదాలు పూజారి మహేశ్ అందజేశారు.

బియ్యం అందజేత

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టులో విధులు నిర్వహిస్తున్న జయశ్రీ–దత్తాత్రేయ దంపతులు న్యూపీకే రామయ్యకాలనీకి చెందిన 20మంది నిరుపేదలకు బియ్యం, నిత్యావసర సరుకులు ఆదివారం అందజేశారు. సీతారామ సేవా సమితి సభ్యురాలు గోలివాడ చంద్రకళ, కంది సుజాత, అనురాధ, కొప్పుల శ్రీను పాల్గొన్నారు.

ఘనంగా శ్రీలక్ష్మీనర్సింహ స్వామి కల్యాణోత్సవం


పూజలు చేస్తున్న పండితులు

ధర్మారం: మండలంలోని ఖిలావనపర్తి గ్రామంలో స్వయంభూగా వెలసిన శ్రీలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం అత్యంత వైభవోపేతంగా స్వామివారి తిరుక్కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం అగ్ని ప్రతిష్ఠ స్థాలీపాక హోమం, బలిహరణం, తీర్థప్రసాదాలతో కార్యక్రమం ముగిసింది. ఆలయ ఈవో కాంతారెడ్డి, ఆలయ కమిటీ మాజీ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీభక్తాంజనేయస్వామి ఆలయంలో పూజలు


రామగుండం: పట్టణంలోని శ్రీభక్తాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం స్థానిక కార్పొరేటర్ కౌశిక లత–హరి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తికి వడమాల సమర్పించగా ఆలయ పూజారి కమ్మల చంద్రశేఖర్ శర్మ ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం దర్శనానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి


మాట్లాడుతున్న సునీల్‌రెడ్డి

మంథని: అకాల వర్షాల నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంథని మార్కెట్ యార్డును ఆదివారం సందర్శించి ధాన్యాన్ని కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోళ్లు నత్తనడకన సాగుతుండంతో అకాల వర్షాలు పడుతుండంతో ధాన్యం తడిసిపోతుండంతో రైతులు నష్టపోతున్నారని అన్నారు. ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం తడిసిన ధాన్యానికి గ్రేడ్‌లు లేకుండా కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

సుందరయ్య ఆశయ సాధనకు కృషి చేయాలి


పెద్దపల్లిరూరల్: నివాళి అర్పిస్తున్న నాయకులు


కాల్వశ్రీరాంపూర్‌లో..


యైటింక్లయిన్‌కాలనీ: సీఐటీయూ నాయకులు

రామగిరి: పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఎం నాయకులు కోరారు. ఆదివారం సుందరయ్య వర్ధంతి నిర్వహించి జెండా ఆవిష్కరణ చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దొమ్మటి కొమురయ్య, నాయకులు ఎండీ.హమీద్ పాషా, ఎం.వెంకటేశ్వర్లు, ఎం.ప్రభాకర్, కె.వేణుగోపాల్, ఎల్.రాజలింగయ్య, మొండయ్య పాల్గొన్నారు.

సీఐటీయూ కార్యాలయంలో..

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి జిల్లా కమిటీ సభ్యుడు ఉల్లి మొగిలి నాయకులతో కలిసి సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సుందరయ్య ప్రజలకు, కార్మికులకు చేసిన సేవలను కొనియాడారు. ఆయన చూపిన మార్గంలో నడుచుకోవాలని సూచించారు. డివిజన్ ఉపాధ్యక్షుడు ఎ.వెంకన్న, కార్యదర్శి ప్రవీణ్ కుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్: స్వాతంత్య్ర సమరయోధుడిగా, భారత కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో కీలకపాత్ర వహించి కమ్యూనిస్టు సిద్ధాంతాలతో సమసమాజ స్థాపనకోసం పోరాటం చేసిన పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి వేడుకలను ఆదివారం కాల్వశ్రీరాంపూర్‌లో ఘనంగా నిర్వహించారు. సీపీఎం అనుబంధ వ్యవసాయకార్మికశాఖ జిల్లా అధ్యక్షుడు మంద రాజేందర్ కమ్యూనిస్టు జెండా ఎగురవేసి సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎర్రవెల్లి ముత్యం రావు, నాయకులు అంబాల లక్ష్మణ్, చెప్యాల మహేశ్, అంజయ్య, లక్ష్మీనర్సు, కొమురయ్య, రవికుమార్, లత, సదయ్య పాల్గొన్నారు.

జ్యోతినగర్: సీపీఎం ఎన్టీపీసీ రామగుండం ఏరియా కమిటీ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. రామగుండం కార్పొరేషన్ రెండో డివిజన్ ఇందిరమ్మ కాలనీలో తోట రవీందర్, మల్కాపూర్‌లో కుందారపు రాజ్‌కుమార్, ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీలో కాదాసి మల్లేశ్ సీపీఎం జెండాలను ఆవిష్కరించారు. సీపీఎం రెండో డివిజన్ కార్యదర్శి గీట్ల లక్ష్మారెడ్డి, సీపీఎం సీనియర్ నాయకురాలు పి.నాగలక్ష్మి, శ్రీనివాస్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, విజయ్, అజయ్, సాంబయ్య, సంపత్, రంగారెడ్డి, రమేశ్, కనకయ్య పాల్గొన్నారు.

సుందరయ్య యువతకు స్ఫూర్తిదాయకం

పెద్దపల్లిరూరల్: రైతాంగ సాయుధ పోరాట యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని సీపీఎం ఏరియా కార్యదర్శి రవీందర్ అన్నారు. పెద్దపల్లిలో ఆదివారం సుందరయ్య వర్ధంతి సందర్భంగా పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి సుందరయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. నాయకులు రవీందర్, అశోక్, జ్యోతి మాట్లాడారు. నాయకులు ప్రశాంత్, శ్రావణ్, నవీన్, సతీశ్ ఉన్నారు.

వడ్లను వెంటనే తూకం వేయాలి


కేంద్రం సందర్శనలో కాంగ్రెస్ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: వరిధాన్యం కొనుగోలు కేంద్రంలో ఉన్న ధాన్యం త్వరగా కొనుగోలు చేయాలని రామగిరి మండలం ఎంపీపీ ఆరెల్లి దేవక్క కోరారు. ఆదివారం రామగిరి మండలం సుందిళ్ల గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. సెంటర్ నిర్వాహకులతో మాట్లాడారు. వర్షాప్రభావం దృష్టిలో పెట్టుకొని వడ్లను వెంటనే తూకం వేయాలని సూచించారు. హమాలీల సంఖ్యను పెంచాలని మంత్రి శ్రీధర్ బాబును కోరినట్లు తెలిపారు. మంథని నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్, అవినాష్ గౌడ్, ముత్యాల శ్రీనివాస్, శివ గౌడ్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించండి


ఎమ్మెల్యేను సత్కరిస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రుషణవేని రమేశ్‌గౌడ్ కోరారు. ఆదివారం ఎమ్మెల్యే విజయరమణారావును వర్కర్స్ యూనియన్ నాయకులతో కలిసి సత్కరించారు. మున్సిపల్ వర్కర్లకు అన్నివిధాలా అండగా ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని పేర్కొన్నారు. రాజయ్య, శంకర్, స్వామి ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


గోదావరిఖనిటౌన్: స్థానిక విద్యాభారతి పాఠశాలలో 2008–09లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ రామచంద్రారెడ్డి–పద్మ దంపతులతో పాటు వారికి చదువు చెప్పిన చిన్ననాటి గురువులను సన్మానించారు.

హనుమాన్ దీక్షాపరులకు బిక్ష


దాతలతో హనుమాన్ దీక్షాపరుల బృందం

రామగుండం: పట్టణానికి చెందిన రిటైర్డ్ జెన్‌కో ఉద్యోగి జక్కనబోయిన రాజేందర్–జ్యోతి దంపతులు ఆదివారం హనుమాన్ దీక్షాపరులకు బిక్ష ఏర్పాటు చేశారు. అనంతరం దీక్షాపరులు రాజేందర్ కుటుంబసభ్యులను ఆశీర్వదించారు. కుడుముల సంజీవ్, కూనారపు రవి, సతీశ్, గూడూరి సుశాంత్ ఉన్నారు.